క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ టూటౌన్ : తమ తండ్రి నుంచి వారసత్వంగా వచ్చే వ్యవసాయ భూమిని ముగ్గురు వారసులకు సమానంగా పొతి చేయాలని కోరుతూ కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి సోమవారం కేతేపల్లి మండలానికి చెందిన నంద్యాల రాంనర్సింహారెడ్డి వినతి పత్రం అందజేశారు. కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామంలో తమ తండ్రి నంద్యాల వెంకయ్య పేరుపై 63, 64, 67 సర్వే నంబర్లలో ఉన్న భూమిని 2013–14 సంవత్సరంలో తన సోదరులు నంద్యాల గోవిందరెడ్డి, నంద్యాల కాంతారెడ్డికి అప్పటి తహసీల్దార్ అక్రమంగా పొతి చేశారని, దానిని రద్దు చేసి గ్రామంలో విచారణ చేసి ముగ్గురు సోదరులకు సమానంగా భూమి పొతి చేసేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

మండల కన్వీనర్‌గా ప్రవీణ్



నాంపల్లి : బీజేపీ సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా మండలంలోని దామెర గ్రామానికి చెందిన తల్లోజు ప్రవీణ్‌చారి రెండోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌చారి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నియమించిన మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గంగిడి మనోహర్‌రెడ్డి, ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

చర్లగూడ వాసికి దళితరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న మారయ్య

మర్రిగూడ : మండలంలోని చర్లగూడెం గ్రామానికి చెందిన బీఎస్పీ మండల అధ్యక్షుడు నాగిళ్ల మారయ్యకు దళిత రత్న అవార్డు దక్కింది. బీఆర్.అంబేడ్కర్ 125వ జయంతి సందర్భంగా అంబేడ్కర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి చేతులమీదుగా మారయ్య దళితరత్న అవార్డును హైదరాబాద్‌లో అందుకున్నారు. అంబేడ్కర్ ఐడియాలజీ, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని ప్రజలకు తెలియజేయడం వంటి అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని తనకు ఈ అవార్డు అందజేశారని మారయ్య తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు చిక్కుడు గుండాలు, జిల్లా అధ్యక్షుడు చింతపల్లి బాలకృష్ణ, గాజుల పున్నమ్మ, స్వర్ణలత, పల్లవి, జోసెఫ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మునుగోడు : మండలంలోని గంగోరిగూడెంకు చెందిన అనిల్ కుమార్–జ్యోతి దంపతుల 4 నెలల కుమారుడు భవ్యాన్ష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లమల్ల కృష్ణారెడ్డి పరామర్శించి రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహ గౌడ్, నాయకులు పాల్వాయి చెన్నారెడ్డి, కిష్టాపురం ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, సూర్యప్రకాష్, మేక ప్రదీప్‌రెడ్డి, నిమ్మల స్వామి, జాల చందు తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని తమ్మడపల్లి గ్రామానికి చెందిన శిరసవాడ ఎల్లయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి సోమవారం ఆస్పత్రికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.25వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట ఇడగోని కృష్ణయ్య, మేకల నరసింహారెడ్డి, గుమ్మకొండ రఘువీరారెడ్డి, శిలుముల జంగయ్య, ఎండీ.నజీర్, చిలువేరు జంగయ్య, శివ, ఉత్తం శ్రీనివాస్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం గ్రామానికి చెందిన జినుకుంట్ల జానమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. సోమవారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జినుకుంట్ల జయశంకర్, రాములు, నగేష్, అంజయ్య, సింగం రమేష్, ఐతగోని జానీ, రామచంద్రు, మారయ్య, సోమయ్య, మల్లేష్, సురేష్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు భూమిపూజ



రవిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మునుగోడు : మండలంలోని గంగోరిగూడెంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం ఎదుట నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభ ఏర్పాటుకు విరాళాలు అందించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నారబోయిన రవిముదిరాజ్, సర్పంచ్ పానుగంటి పారిజాత నర్సింహగౌడ్, ఉప సర్పంచ్ వీరమళ్ల గోపాల్, పానుగంటి విజయ్, గణేశ్, బండారు మల్లేష్, గోపగోని సందీప్, మర్రి మధు, జనగాం శ్రీకాంత్, గోపగోని శివ, రాకేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- జనావాసాల మధ్య ఫెన్సింగ్ లేకుండా ఏర్పాటు
- భయాందోళనలో ప్రజలు



కట్టంగూర్‌లో కల్మెర రోడ్డు వెంబడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



కురుమర్తి రోడ్డులో..



గాంధీనగర్‌లో..

కట్టంగూర్ : మండలంలోని పామనగుండ్ల, కట్టంగూర్, పందెనపల్లి, బొల్లేపల్లి, మునుకుంట్ల, గార్లబాయిగూడెం, ఎరసానిగూడెం, పరడ, ఈదులూరు గ్రామాల్లో ప్రధాన వీధుల వెంట, పాఠశాలల సమీపంలో ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రజలు, విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని కల్మెర రోడ్డు వెంబడి 2వ వార్డులో ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మనిషి కంటె తక్కువ ఎత్తులో ఉండి ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు గజం దూరంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆ కాలనీ ప్రజలు జంకుతున్నారు. కట్టంగూర్ హైస్కూల్ ప్రహరీ వెంబడి, 3వ వార్డులోని బాల్‌రెడ్డి రైస్‌మిల్ వద్ద, కురుమర్తి రోడ్డులో కంఠమహేశ్వరస్వామి ఆలయం సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

జనావాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కల్మెర రోడ్డులో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో ఆ ప్రాంత చిన్నారుల తల్లిదండ్రులు, ప్రజలు, దారిగుండా వెళ్లే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. కట్టంగూర్ హైస్కూల్‌లో ప్రహరీ వెంబడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెట్లు పెరిగి తీగలకు చెట్ల కొమ్మలు అల్లుకుపోయి ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరగక ముందే విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతోపాటు చెట్ల కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి



ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఫెన్సింగ్ లేకపోవడంతో మూగ జీవాలు ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నాయి. జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ చర్యలు తీసుకోవడంలో విద్యుత్ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ప్రమాదం జరిగితే తప్ప అధికారులు స్పందించడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. – జి. యాదగిరి, కట్టంగూర్

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు



నకిరేకల్ : పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే భగత్

నకిరేకల్ : మండలంలోని పాలెం గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్, మేకలు, గొర్రెల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజులు పాల్గొని పూజలు నిర్వహించారు. అదేవిధంగా మంత్రి తలసాని శ్రీనివాస్ ఓఎస్డీ కళ్యాణ్‌కుమార్, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మినగేష్, నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, పాలెం సర్పంచ్ ఏకుల కవిత విజయ్, కాంగ్రెస్ నేత దైద రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొప్పోలులో గంగదేవమ్మ పండుగ

కేతేపల్లి : గ్రామ దేవతలను స్మరించుకోవడం తెలంగాణ ప్రజల సంప్రదాయమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. సోమవారం మండలంలోని కొప్పోలు గ్రామంలో గంగదేవమ్మ పండుగలో ఆయన పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. పండుగ సందర్భంగా మహిళలు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాల్లో వండిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని దేవతను వేడుకున్నారు. ఈ వేడుకల్లో గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కేతేపల్లి జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బడుగుల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్వీ మండల ఉపాధ్యక్షుడు మట్టిపల్లి నాగరాజు, ఏర్పుల సొడయ్య తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని పానగల్లు శ్రీ ప్రహ్లాద లక్ష్మీ నరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం హోమం, మండప పూజ, రుద్ర గణపతి, లక్ష్మీ నరసింహ పత్నీ సమేత నవగ్రహ మూలమంత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా ప్రదోష పూజలు, దేవత హవనములు, ఉదకశాంతి నీరాజనం, మంత్రపుష్ప కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాపోలు శ్రీనివాస్, తోట రామాంజనేయులు, బూరుగు బాలకిషన్, పాలాభి విజయమోహన్, మిర్యాల యాదయ్య, మిట్టపల్లి రాజేందర్, సైదులు, దేవేందర్, వాసుదేవ్, శ్రీనివాస్, పట్టణ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంపే లక్ష్యం



తిప్పర్తిలో బడి బాట ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పాశం రాంరెడ్డి

రామగిరి(నల్లగొండ) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం చేపట్టిందని బీఆర్ఎస్ పార్టీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పాశం రాంరెడ్డి అన్నారు. సోమవారం తిప్పర్తి మండలంలో బడి బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి కరపత్రాలతో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తిప్పర్తి మండలంలో 32 ప్రాథమిక పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, హైస్కూళ్లు 6, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉన్నాయన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఎంఈఓ అరుంధతి, సర్పంచ్ రొట్టెల రమేష్, ప్రధానోపాధ్యాయులు వెంకటమ్మ, యోగేంద్రనాథ్, మిట్ట శ్రీనివాస్‌రెడ్డి, వెంకన్న, వీరాచారి, శంకర్, నరహరి పాల్గొన్నారు.

చిట్యాల : మండలంలోని తాళ్ళవెల్లెంల గ్రామంలో యూపీఎస్ ఉపాధ్యాయులు సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సైదులు, ఎస్ఎంసీ చైర్మన్ జోగు లావణ్య లింగస్వామి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శాలిగౌరారం : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంఈఓ నాగయ్య అన్నారు. సోమవారం మండలంలోని చిత్తలూరు, తుడిమిడి, గురజాల గ్రామాల్లో బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ఆందోళన

చండూరు : తమకు గౌరవ వేతనం ఇవ్వాలని, బియ్యం దిగుమతి హమాలీ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చండూరు, గట్టుప్పల మండలాల్లో సోమవారం రేషన్ షాపులను బంద్ చేసి డీలర్లు ఆందోళన నిర్వహించారు. సమస్యలు పరిష్కరించే వరకు షాపుల తెరిచేది లేదని డీలర్లు తెలిపారు.

8నుంచి ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు

కనగల్ : మండల పరిధిలోని శాబ్దుల్లాపురం గ్రామంలో ఈ నెల 8నుంచి ఆలయ తృతీయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న జాతర, ముత్యాలమ్మ అమ్మవారికి గ్రామస్తులతో జలాభిషేకం, అనంతరం అన్నదాన కార్యక్రమం, 9న ఊర బోనాలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలన్నారు.

‘పట్టణ ప్రగతి’ ని విజయవంతం చేయాలి



పట్టణ ప్రగతి బుక్‌లెట్ చూపిస్తున్న కమిషనర్

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 16న నీలగిరి పట్టణంలో నిర్వహించే పట్టణ ప్రగతి దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన వార్డు ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10వ తేదీ వరకు వార్డు కమిటీలతో సమావేశాలు ఏర్పాటు చేసి పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని వివరించాలన్నారు. మహిళలు, వార్డు కమిటీ సభ్యులు, యువత, అధిక సంఖ్యలో భాగస్వాములు అయ్యే విధంగా వార్డు ఆఫీసర్లు దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ ఈఈ రాములు, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి



తిప్పర్తి పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు

నల్లగొండ టౌన్ : ఆశ వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం ఇవ్వాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ నల్లగొండ జిల్లా గౌరవ అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ పట్టణంలోని పానగల్లు, మాన్యంచల్క, లైన్‌వాడ, రాములబండ పీహెచ్‌సీల ఎదుట ధర్నాలు నిర్వహించి మెడికల్ ఆఫీసర్లకు, ఆశ నోడల్ ఆఫీసర్లకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. టీబీ, లెప్రసీ, కంటి వెలుగు తదితర పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, 2021 జూలై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల ఏరియర్స్ చెల్లించాలని కోరారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్కు అలవెన్స్ నెలకు రూ.1000 చొప్పున 16 నెలల బకాయిలు వెంటనే చెల్లించాలని, రిజిస్టర్లను ప్రభుత్వం సరఫరా చేయాలని, యూనిఫాం ఇవ్వాలని, జిల్లా ఆస్పత్రిలో ఆశ కార్యకర్తలకు రెస్టు రూం ఏర్పాటు చేయాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, పోలె సత్య నారాయణ, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రేమలత, వీరభద్రమ్మ, కవిత, శోభారాణి, మంగమ్మ, కాశమ్మ, ఇందిర, రేణుక తదితరులు పాల్గొన్నారు.

రామగిరి(నల్లగొండ) : ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి టి.పార్వతమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తిప్పర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించి మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పార్వతమ్మ మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జూన్ 12న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు ఎస్.పుల్లమ్మ, పి.పుష్ప, పి.రాజేశ్వరి, నిర్మల, ధనమ్మ, మల్లేశ్వరి, సునీత, శైలజ, భిక్షపమ్మ, వసంత, యాదమ్మ, రమణ, రేణుక, జ్యోతి, సువర్ణ, కనకదుర్గ, కవిత, పద్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు : తమకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ మండల కన్వీనర్ వరికుప్పల ముత్యాలు ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు సోమవారం స్థానిక మండల వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఆశ వర్కర్లకు ప్రసూతి సెలవులు ఇవ్వాలని కోరారు.

నాంపల్లి : తమకు కనీస వేతనం అందించాలని కోరుతూ ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు సోమవారం మండల వైద్యాధికారి మహ్మద్ ఇక్బాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు రమావత్ కవిత, మండల కార్యదర్శి ఎదుళ్ల సునిత, లక్ష్మమ్మ, లలిత, కవిత, శోభ, నీలిమ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌తో సిరుల పంటలు



మాట్లాడుతున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల, చిత్రంలో కలెక్టర్ తదితరులు



సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది, ప్రజలు

- నల్లగొండలో ఘనంగా విద్యుత్ విజయోత్సవం కార్యక్రమం
- పాల్గొన్న కలెక్టర్, నల్లగొండ ఎమ్మెల్యే

నల్లగొండ : తెలంగాణ రాష్ట్రం రాకముందు విద్యుత్ సరఫరా సక్రమంగా లేక చీకట్లో మగ్గే పరిస్థితి ఉండేదని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల సిరుల పంటలు పండిస్తున్నారని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నల్లగొండ శాసనసభ నియోజకవర్గ విద్యుత్ విజయోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 2014వ సంవత్సరానికి ముందు విద్యుత్ సరఫరా సరిగ్గా లేక కళ్ల ముందే పంటలు ఎండిపోయిన పరిస్థితి ఉండేదన్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోయి రైతులు నష్టపోయారన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చారన్నారు. మొదటి సంవత్సరం 9గంటల విద్యుత్ ఇచ్చి రెండో సంవత్సరం 24గంటల విద్యుత్ ఇచ్చిన ఏకైక ప్రభుత్వం తెలంగాణనే అన్నారు. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా రూ.40 వేల కోట్లు ఖర్చు చేసి విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టారన్నారు. ఉచిత విద్యుత్‌తోపాటు పెట్టుబడి సాయం అందిస్తూ రైతులకు కేసీఆర్ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. విద్యుత్ శాఖలో కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి ప్రభుత్వం పే స్కేల్ అందిస్తోందన్నారు. విద్యుత్ శాఖ మంత్రి జిల్లాకు చెందినవారు కావడం వల్ల జిల్లాలో ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తున్నారని అన్నారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో 2014కు ముందు 7778 మెగావాట్ల విద్యుత్ ఉండగా ప్రస్తుతం 18567 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రపంచంలో ఐక్యరాజ్య సమితి హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇండెక్స్‌లో విద్యుత్ కూడా ఒక పారామీటర్ అని.. మన దేశం కంటే మన రాష్ట్రంలో సగటున 70 శాతం ఎక్కువగా తలసరి విద్యుత్ వాడకం ఉందని తెలిపారు. తెలంగాణ తలసరి విద్యుత్ వినియోగం 2140 యూనిట్లు కాగా దేశంలో తలసరి యూనిట్ 1255 యూనిట్లుగా ఉందని వివరించారు. జిల్లాలోని దామరచర్లలో యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ ద్వారా 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి రానుందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల వ్యవసాయం పెరిగిందని, పరిశ్రమలకు ఇవ్వడం వల్ల ఉత్పత్తి, ఉపాధి పెరిగిందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన నల్లగొండ విద్యుత్ శాఖ డీఈ శంకరయ్య ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఉచిత విద్యుత్‌పై రైతులు పొందుతున్న లాభాల గురించి దర్వేశిపురం గ్రామానికి చెందిన అలుగుబెల్లి నర్సిరెడ్డి వివరించారు. రజకులకు అందుతున్న ఉచిత విద్యుత్‌పై చెన్నయ్య వివరించారు. పవర్‌లూం కార్మికుడు సత్యనారాయణ, నాయీబ్రాహ్మణుల సంఘం నాయకుడు లాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ వల్ల ఎంతో లబ్ధి పొందుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, ఎంపీపీలు కరీం పాష, విజయలక్ష్మి, జెడ్పీటీసీ వెంకటేశం, సింగిల్ విండో చైర్మన్ సహదేవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, ఖయ్యూం బేగ్, దయాకర్, మోహన్‌బాబు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పర్యావరణ పరిరక్షణ దినోత్సవం



నల్లగొండలో మొక్క నాటుతున్న డీఈఓ



నార్కట్‌పల్లి : మొక్కలు అందజేస్తున్న శంకర్‌రెడ్డి

నల్లగొండ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా క్లీన్‌హోమ్ గ్రీన్‌హోమ్ ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజ్ ఆధ్వర్యంలో ఇది నా చెట్టు కార్యక్రమంలో భాగంగా డీఈఓ కార్యాలయంలో సోమవారం డీఈఓ భిక్షపతి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు ఎన్జీ కాలేజీలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బండారు ప్రసాద్, లింగయ్య సుబ్బారావు, శౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టూటౌన్ : పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పలు వార్డుల్లో స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్ అనే కార్యక్రమంలో భాగంగా వార్డుల్లో ఆర్ఆర్ఆర్ సెంటర్లు ఏర్పాటు చేసి పాత దుస్తులు, బ్యాగులు, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు సేకరించామన్నారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, ఏసీపీ నాగిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మూర్తుజాఅలీ, శంకర్, శ్రీనివాస్, కౌన్సిలర్ బోయినపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిరేకల్ : పర్యావరణ దినోత్సవం సందర్భంగా నకిరేకల్ కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. నకిరేకల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే ఆరిఫ్, జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, శ్రీనివాసరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో గ్రీన్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారు. చైర్మన్ ఎనుగుల శంకర్‌రెడ్డి, కల్పానారెడ్డి, ఉపేందర్, సంధ్యారాణి, బొడ్డుపల్లి వెంకటాచారి, కట్ట యాదగిరిరెడ్డి, రేగట్టి రుద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మి, అశ్విక్, మణి, కందిమళ్ల జాన్‌రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



శ్రీకాంత్‌గౌడ్, ఎస్‌ఐ

కేతేపల్లి : కేతేపల్లి ఎస్‌ఐగా శ్రీకాంత్‌గౌడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన అనిల్‌రెడ్డి సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పెన్‌పహాడ్ మండలం ఎస్‌ఐ శ్రీకాంత్ గౌడ్‌ను కేతేపల్లికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌గౌడ్‌ను పలువురు నాయకులు, పోలీసు సిబ్బంది శాలువాతో సన్మానించారు.

కారు ఢీకొని బాలికకు తీవ్ర గాయాలు

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో ఇంటి ముందు నిల్చున్న బాలికను ఓ కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్రాంపల్లి గ్రామంలో కుక్కల అనసూయ మూడేళ్ల కూతురు చైత్ర సోమవారం తమ ఇంటి ముందు నిల్చుని ఉండగా ఆ దారి వెంట అతివేగంగా వెళుతున్న ఓ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో చైత్ర కాలుకు తీవ్ర గాయమైంది. వైద్య చికిత్స నిమిత్తం బాలికను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాలిక తల్లి అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మారోజు చంద్రమౌళికి నివాళి



నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి

శాలిగౌరారం : మండలంలోని గురజాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన సీపీఎం మండల మాజీ కార్యదర్శి మారోజు చంద్రమౌళి స్మారక స్థూపాన్ని సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ఆవిష్కరించి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ చిన వెంకులు, రాచకొండ వెంకన్న, మండల కార్యదర్శి చలకాని మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో అన్నదానం

నకిరేకల్ : ఉద్యమ నాయకురాలు కల్లు సుగుణమ్మ ప్రథమ వర్ధంతి ఈ సందర్భంగా నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాళ ప్రమీల, మండల కార్యదర్శి రాచకొండ వెంకన్న బొజ్జ చిన వెంకులు, వంటిపాక వెంకటేశ్వర్లు, బచ్చుపల్లి ప్రకాశ్‌రావు తదితరులు ఉన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కట్టంగూర్ : సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో మురముదాల హమాలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రామకృష్ణ, యర్కల శ్రీనివాస్, వెంకన్న, సత్యనారాయణ, సైదులు, నాగరాజు, శంకర్, యాదయ్య, సందీప్, రాజు పాల్గొన్నారు.